సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



మార్పులు, చేర్పులు షురూ !

ఇల్లెందుకు చెందిన వెంకట్‌గౌడ్ బీఆర్ఎస్, టేకులపల్లికి చెందిన సురేందర్‌రావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

8లో



ఏడు గంటలు హల్‌చల్

తన రెండున్నర ఎకరాల భూమి, ఇంటిని ఆక్రమించుకున్నారని కిన్నెరసానికి చెందిన గౌతమ్ సెల్ టవరెక్కి నిరసన తెలిపాడు.

8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రారంభమై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ముత్తంగి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సోమవారం స్వామివారికి ఈ అలంకరణ చేయడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

31న బాలల సైన్స్ కాంగ్రెస్

కొత్తగూడెంఅర్బన్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఈనెల 31న కొత్తగూడెంలో జరుగుతాయని డీఈఓ వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నవంబర్ 16న ప్రారంభం అవుతాయని, ఇందుకోసం ఉపాధ్యాయులు విద్యార్థులను సంసిద్ధులు చేయాలని, ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బాలల సైన్స్ కాంగ్రెస్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనేది ఈ ఏడాది సైన్స్ కాంగ్రెస్ ప్రధాన అంశంగా ఉంటుందని వివరించారు. ఒక్కో పాఠశాల నుంచి విద్యార్థులు ఎన్ని ప్రాజెక్టులైనా రూపొందించుకోవచ్చని, ప్రదర్శనకు వీలు ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఈనెల 29 వరకు గడువు ఉందని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు (92472 96012)ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో స్వర్ణ పతకాలు



పతకాలతో చంద్రకళ, రమ్య

అశ్వాపురం: హైదరాబాద్‌లో ఆది, సోమవారాల్లో జరిగిన మాస్టర్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన క్రీడాకారిణులు చంద్రకళ, రమ్యకృష్ణ సత్తా చాటి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. చంద్రకళ సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అండ్ స్పెషల్ కేటగిరి నాలుగు విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. రమ్యకృష్ణ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది.

డాక్టర్ శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని కింగ్ కోటిలో జరిగిన ఆరోగ్య ఉత్సవ్ – 2023 కార్యక్రమంలో చుంచుపల్లి మండలం 4 ఇంక్లైన్ గ్రామానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు రామంచి శ్రీనివాస్‌కు జాతీయ ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి వేణుగోపాలచారి, డాక్టర్ వీరమాచినేని రామకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ప్రపంచ పర్యావరణ సంస్థ జిల్లా అధ్యక్షుడు బరిగెల భూపేష్, ప్రకృతి సేవకులు మొక్కల వెంకటయ్య, మొక్కల రాజశేఖర్, మాదిగ సంక్షేమ సంఘం నాయకులు కొయ్యడ వెంకన్న, సామర్ల సమ్మయ్య, కూరగాయాల శ్రీనివాస్, ఆవునూరి సంజీవరావు, కొత్తూరి మదనయ్య, కొత్తూరి రవి తదితరులు అభినందించారు.

సమరానికి సై



ఎన్నికల సమరానికి సైరన్ మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వచ్చే నెల 30న పోలింగ్ జరగనుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేయగా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తయింది. ఎన్నికల నగారా మోగిన నేపథ్యాన వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో ప్రజాప్రతినిధుల అధికారిక పర్యటనలకు బ్రేక్ పడింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించారు. కాగా, ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకెళ్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు ప్రకటన కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

షెడ్యూల్ విడుదలతో మోగిన ఎన్నికల నగారా

- వచ్చే నెల 30న పోలింగ్.. అమల్లోకి వచ్చిన కోడ్
- ప్రజాప్రతినిధుల అధికారిక పర్యటనలకు బ్రేక్
- ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు
- అభ్యర్థుల ప్రకటన, ప్రచారంతో బీఆర్ఎస్‌లో జోష్
- ఎప్పుడు ప్రకటిస్తారోనని కాంగ్రెస్‌లో ఉత్కంఠ

సరిగ్గా 51 రోజులు

నేటి నుంచి లెక్కిస్తే పోలింగ్‌కు ఇంకా 51 రోజుల సమయం ఉంది. వచ్చే నెల 3న నోటిఫికేషన్ వెలువడనుండగా, అదేనెల 30న పోలింగ్ జరుగుతుంది. అదేరోజు నుంచి నవంబర్ 10 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించి, 13న పరిశీలించడంతో పాటు 15న ఉపసంహరణకు అవకాశమిస్తారు. ఆ తర్వాత బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారు. ఇక నవంబర్ 30న పోలింగ్ జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. అయితే, 2018 ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 7న పోలింగ్ జరగగా.. ఈసారి వారం ముందుగానే జరగనుంది.

తొలిరోజే రూ.30.65లక్షలు స్వాధీనం

ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఉద్యోగులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల పలుమార్లు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అలాగే, నమూనా ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై విస్తృ త అవగాహన కల్పించారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాను ఈనెల 4న విడుదల చేయగా, ఖమ్మం జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణకు 24 మంది నోడల్ అధికారులను నియమించారు. అలాగే, తనిఖీల కోసం ఏర్పాటుచేసిన 12 చెక్‌పోస్టులను సోమవారం నుంచి ప్రారంభించారు. కాగా, మధిర మండలం ఆత్కూరు క్రాస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.17.25 లక్షలు, వైరా, తల్లాడల్లో రూ.5లక్షల చొప్పున నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కొణిజర్లలోని చెక్ పోస్టు వద్ద రూ.2.40లక్షలు, చింతకాని మండలం పందిళ్లపల్లిలో రూ.లక్ష స్వాధీనం చేసుకోగా, మొదటిరోజే రూ.30.65లక్షల నగదు పట్టుబడినట్లయింది.

అధికారిక పర్యటనలకు బ్రేక్

కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగానే ఉమ్మడి జిల్లాలోనూ కోడ్ అమల్లోకి వచ్చింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఉదయం భద్రాచలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత సీతారామచంద్రస్వామిని దర్శించుకోగా, అనంతరం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. ఇంతలోనే కోడ్ అమల్లోకి రావడంతో ఈ కార్యక్రమాన్ని అధికారులే పూర్తిచేశారు. మిగతా నియోజకవర్గాల్లో కూడా షెడ్యూల్ వెలువడ్డాక అధికారిక కార్యక్రమాలు రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రహదారులపై పార్టీల నేతల కటౌట్లు, పోస్టర్లు, జెండాలు తొలగించడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అలాగే, నేతల విగ్రహాలు, పార్టీ స్తూపాలను ముసుగులతో కప్పేశారు.

అటు జోష్.. ఇటు ఉత్కంఠ

షెడ్యూల్ ప్రకటనతో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారంలో వేగం మరింత పెరగనుంది. ఆపార్టీ అభ్యర్థులను ప్రకటించి 50 రోజులు దాటగా... ఓవైపు అసంతృప్తి కొనసాగుతున్నా బుజ్జగిస్తూనే ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ప్రచారంలో జోరు పెంచడంపై ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో చివరకు తమ నియోజకవర్గం నుంచి ఎవరు బరిలో ఉంటారని కేడర్ ఎదురుచూస్తోంది. హస్తినలో అభ్యర్థుల వడపోత జరుగుతుండగా ఆశావహులు టికెట్లు దక్కించుకునే ప్రయత్నాల్లో మునిగారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల అభ్యర్థులను కూడా ప్రకటిస్తే ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

కోడ్ అమల్లోకి వచ్చింది



అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనందున జిల్లాలో సోమవారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు 24 గంటలు పనిచేసేలా 1950 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తాం. కంట్రోల్ రూంకు, సి-విజిల్ యాప్‌నకు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపడతాం. క్వాలిటీ రెస్పాన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రభుత్వ కార్యాలయాల్లోని రాజకీయ నాయకుల ఫొటోలు 24 గంటల్లోగా, ప్రభుత్వ స్థలాల్లోని పోస్టర్లు, బ్యానర్లు 48 గంటల్లోగా తొలగించాలని ఆదేశాలు జారీ చేశాం.

– ప్రియాంక ఆల, కలెక్టర్

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు



జిల్లాలో 223 పోలింగ్ కేంద్రాలు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయి. అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లినపుడు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తాం. 24 గంటలూ పనిచేసేలా జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నగదు లావాదేవీలకు సంబంధించి ఆధారాలను వెంట ఉంచుకోవాలి. లేదంటే సీజ్ చేస్తాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎన్నికల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి.

– వినీత్, ఎస్పీ

ప్రజాసంక్షేమమే ధ్యేయం

- కరకట్ట పొడగింపుతో భద్రాద్రి వాసులకు రక్షణ
- నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు

భద్రాచలం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం భద్రాచలంలో పర్యటించిన ఆయన రూ.15.10 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కూనవరం రోడ్డులో రూ. 38 కోట్లతో కరకట్ట పొడగింపునకు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.క్యాంటీన్, కంటి చికిత్స ఓటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గోదావరి వరదల నుంచి భద్రాచలం ప్రజలను కాపాడేందుకు కరకట్ట పొడిగింపు అవసరాన్ని సీఎం కేసీఆర్ గుర్తించి రూ. 38 కోట్లు మంజూరు చేశారని అన్నారు. శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తుందని, త్వరలోనే ఆ పనులు పూర్తవుతాయని చెప్పారు. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. పట్టణంలో రూ.2.60 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రూ.50 లక్షలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.1.10 కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. దుమ్ముగూడెం మండలంలో రూ.1.50 కోట్లతో, చర్ల మండలంలో రూ.50 లక్షలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.1.50 కోట్లతో ఇతర అభివృద్ధి పనులు, వెంకటాపురం మండల కేంద్రంలో రూ.కోటితో సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డివైడర్లతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు.

రామయ్య సన్నిధిలో పువ్వాడ..

కార్యక్రమాల అనంతరం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేసి, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

ఏరియా ఆస్పత్రిలో ప్రారంభించిన కంటి చికిత్స కేంద్రంలో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రజలకు అవసరమైన శస్త్ర చికిత్స చేయాలని, కళ్లజోళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, డీడీ ఎంహెచ్ఓ రవిబాబు, ఏఎస్పీ పరితోష్ పంకజ్, పంచాయతీరాజ్ డీఈ మంగ్యా, నీటి పారుదల శాఖ అధికారి వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసం చేశారు

భద్రాచలంటౌన్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటన రాజకీయ లబ్ధి కోసమే తప్ప భద్రాద్రి అభివృద్ధి కోసం కాదని, మరోసారి భద్రాద్రి ప్రజలను మోసం చేసేలా శంకుస్థాపనలు చేశారని ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల కోడ్ వెలువడే గంట ముందు హడావిడిగా శంకుస్థాపనలు చేశారని, గతంలో ప్రకటించిన రూ.100 కోట్లు, రూ.1000 కోట్ల లాగే ఇవి కూడా ప్రకటనలకే పరిమితం అవుతాయని విమర్శించారు.

యువత భజరంగ్‌దళ్‌లో చేరాలి

వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సంపర్క ప్రముఖ్ వెంకటేశ్వర రాజు



శోభాయాత్ర నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు, సభ్యులు

కొత్తగూడెంటౌన్: గ్రామాల్లో ప్రతీ యువకుడు భజరంగ్‌దళ్‌లో చేరితే భవిష్యత్‌లో దేశాన్ని హిందూ ధర్మంగా మార్చి కాపాడుకోవచ్చని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సంపర్క ప్రముఖ్ వెంకటేశ్వర రాజు, తెలంగాణ ప్రాంత మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రామాలయం నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ శోభాయాత్ర నిర్వహించగా, వారిద్దరూ జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే స్టేషన్, సూపర్‌బజార్ మీదుగా లక్ష్మీదేవిపల్లి మండలలోని దారా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్న అనంతరం అక్కడ జరిగిన సభలో వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదాసి వెంకటేశ్వర్లు, రాములోనియా, ఆవులూరి శ్రీనివాస్‌రెడ్డి, రేగడి విజయలక్ష్మి, కాకరాల శ్రీనివాస శర్మ, గాదె తులసీ, చిలుకూరి నాగేశ్వర్‌రావు, దారా రమేష్, గంగాదరి సీత, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికలు జరిగేనా?!

- నేడు గుర్తులు కేటాయించేలా తొలుత షెడ్యూల్
- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో సందిగ్ధత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరుగుతాయా, లేదా అనే సందిగ్ధతకు తెర పడడం లేదు. ఓపక్క ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియగా, షెడ్యూల్ ప్రకారం మంగళవారం గుర్తులు కేటాయించాల్సి ఉంది. ఇంతలోనే సోమవారం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సింగరేణి ఎన్నికల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా, గత నెల 30న సింగరేణి యాజమాన్యం ఓటర్ల జాబితా సమర్పించాల్సి ఉన్నా ఇవ్వలేదని ఇటీవల కేంద్ర కార్మిక శాఖ తరఫున డీవైసీఎల్సీ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇక గుర్తింపు సంఘం ఎన్నికలను మరికొంత కాలం వాయిదా వేయాలని కోరుతూ యాజమాన్యం వేసిన పిటిషన్‌ను సింగిల్ బెంచ్ కొట్టేయగా, మళ్లీ కోర్టులో సవాల్ చేసింది. ఇందుకు సంబంధించిన తీర్పు 11వ తేదీన రానున్న నేపథ్యాన అప్పటి వరకు జాబితా సమర్పించొద్దని యజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. కాగా, ఇప్పటికే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి అన్ని సంఘాలు నామినేషన్లు వేశాయి. అయితే, మెజారిటీ సంఘాలతో సమావేశమైన యజమాన్యం ఎన్నికలు వాయిదా వేయాలనే తీర్మానాలు స్వీకరించి.. ఇదే విషయాన్ని కోర్టుకు సమర్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై 11వ తేదీన స్పష్టత వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

ప్రజావాణికి పోటెత్తారు..

- మంత్రి పర్యటనతో హాజరుకాని కలెక్టర్, అదనపు కలెక్టర్
- దరఖాస్తులు స్వీకరించిన డీఆర్ఓ



ప్రజావాణిలో సమస్యలు వింటున్న డీఆర్ఓ



వినతుల సమర్పణకు క్యూ కట్టిన ప్రజలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. భద్రాచలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రావడంతో కలెక్టర్ ఆయా కార్యక్రమాలకు హాజరు కావాల్సి వచ్చింది. అదనపు కలెక్టర్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు సైతం మంత్రి ప్రోగ్రాంకు వెళ్లడంతో కొంతమంది జిల్లా అధికారుల భాగస్వామ్యంతో ప్రజావాణి నిర్వహించాల్సి వచ్చింది. పలు సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. డీఆర్ఓ రవీంద్రనాథ్ ఓపికగా ప్రతి దరఖాస్తుదారుని నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

కర్నూలు జిల్లాలో రామయ్య భూములు



భూములను పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాద్రి రామయ్య ఆలయానికి సంబంధించి ఏపీలోని కర్నూలు జిల్లాలోని భూములను ఈఓ రమాదేవి సోమవారం పరిశీలించారు. ఆ జిల్లాలోని తోగర్చేడు, ఎర్రగుడి గ్రామాల్లో 33 ఎకరాల భూములకు సంబంధించి రెవెన్యూ, పోలీస్ శాఖ సహకారంతో ఫిజికల్ పొజిషన్ తీసుకున్నారు. అలాగే తాళ్లగోకులపాడు గ్రామంలోని భూమితో పాటు మొత్తం 56 ఎకరాల భూములకు సంబంధించి ఈ పాస్ బుక్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కుమార్, సుబ్బారావు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా యాదగిరి

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు సీడీఎంఏ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కమిషనర్‌గా విధుల్లో ఉన్న నవీన్‌ను తిరిగి మున్సిపల్ డీఈగా పరిమితం చేశారు. యాదగిరి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా మెప్మా విభాగంలో అకౌంట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.

బాలసాని అలక

- కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరం
- అనుచరుడికి టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపం
- భద్రాచలం బాధ్యతలు తప్పించడంతో కినుక



బాలసాని లక్ష్మీనారాయణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నేత బాలసాని లక్ష్మీనారాయణ అలక బూనారు. భద్రాచలం నియోజకవర్గ ప్రచార సమన్వయ బాధ్యతల నుంచి ఆయనను తప్పించడంతో కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ బాధ్యతలు ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాత మధుకు అప్పగించారు. బాలసాని అనుచరుడిని కాదని తెల్లం వెంకట్రావుకు భద్రాచలం పార్టీ టికెట్ కేటాయించడం కూడా ఆయన పార్టీకి దూరంగా ఉండడానికి మరో కారణంగా తెలుస్తోంది.

ఆశించి భంగపడి..

ఎమ్మెల్సీగా బాలసాని పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ అదే పదవి వస్తుందని ఆశించారు. అయితే, ఆ పదవి తాత మధుకు అప్పగించగా ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు ఇస్తారని ప్రచారం జరిగింది. చివరకు అది కూడా మధుకే దక్కగా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఏదైనా వస్తుందని భావించినా నెరవేరలేదు. ఇక భద్రాచలం నియోజకవర్గానికి చెందిన తెల్లం వెంకట్రావు ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో ఆయనకే పార్టీ టికెట్ ఇచ్చి నియోజకవర్గ ప్రచార సమన్వయ బాధ్యతలు బాలసానికి అప్పగించారు. కానీ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్‌లో జరిగిన రాజకీయ పరిణామాలతో సమన్వయ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి తాత మధుకు కట్టబెట్టారు. దీనికి తోడు భద్రాచలంలో బీఆర్ఎస్ సీనియర్ నేత బోదబోయిన బుచ్చయ్య బాలసాని అనుచరుడిగా కొనసాగుతుండగా, ఆయనకు టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దల ముందు ప్రతిపాదించారు. అయితే, అది కూడా దక్కకపోవడంతో బాలసానితో పాటు ఆయన అనుచర వర్గం పార్టీ పెద్దలపై అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో తగిన స్థాయిలో గుర్తింపు ఇవ్వడం లేదన్న కారణంతో బాలసాని భద్రాచలం నియోజకవర్గంలో అడుగుపెట్టడం లేదు.

బుజ్జగించినా..

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న బాలసానిని.. మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బుజ్జగించారు. మంత్రి హరీశ్‌రావుతో కూడా మాట్లాడించారు. పార్టీలో తనకు అవమానం జరిగిందని ఆయన అన్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో బాలసాని బీఆర్ఎస్‌లో కొనసాగుతారా.. ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అని అనుచరవర్గం ఎదురుచూస్తోంది. గుర్తింపు లేని చోట ఉండకూడదని అనుచరులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ నేతల నుంచి ఆహ్వానం అందినట్లు ప్రచారం సాగుతోంది.

క్లుప్తంగా

నవరాత్రి వేడుకల పోస్టర్లు ఆవిష్కరణ



వేడుకల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు శ్రీ దేవీ నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల ప్రచార పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన పెద్దమ్మతల్లిని దర్శించుకోగా అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ధర్మకర్తలు చింత నాగరాజు, గంధం వెంగళరావు, కాటూరపు లక్ష్మీనారాయణ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మార్కెట్ చైర్మన్ భూక్యా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ భద్రతా విధుల్లో ఎస్పీఎఫ్



ఎస్పీఎఫ్ ఉద్యోగులతో సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: మణుగూరులోని భద్రాద్రి పవర్ ప్లాంట్ భద్రతకు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) సిబ్బంది సోమవారం విధుల్లో చేరారు. ఒక అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఐ, నలుగురు ఎస్సైలు, ముగ్గురు ఏఎస్సైలు, 12మంది హెడ్‌కానిస్టేబుళ్లు, పది మంది కానిస్టేబుళ్లు విధుల్లో చేరగా... డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్లాంట్‌కు భద్రత విధుల్లో పాల్గొననున్నారు. ఈసందర్భంగా వీరు సీఈ బి.బిచ్చన్నను మర్యాదపూర్వకంగా కలవగా, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్.రమేష్, ఎస్ఈలు రామ్మూర్తి, రాంప్రసాద్, డీఈ సత్యనారాయణ, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కే.ఆర్.రెడ్డి, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


జాతీయ స్థాయిలో ఏకలవ్య విద్యార్థి ప్రతిభ



చరణ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బోడ చరణ్ జాతీయస్థాయి కల్చరల్ ఫెస్ట్‌లో ప్రతిభ చాటాడు. ఇటీవల సిర్పూర్ కాగజ్‌నగర్‌లో జరిగిన టీఎస్ఈఎంఆర్ఎస్ కల్చరల్ ఫెస్ట్‌లో ఆర్ట్ త్రీడీ డైమన్షన్ పోటీల్లో పాల్గొన్న ఆయన రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. అంతకుముందు జార్ఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ ఆయన మొదటి బహుమతి కైవసం చేసుకోగా, సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.భద్రయ్యను పాటు ఉపాధ్యాయులు సన్మానించారు.

‘భోజన’ కార్మికుల సమ్మె విరమణ



కార్మికులతో మాట్లాడుతున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: గత 20 రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఎట్టకేలకు విరమించారు. కలెక్టరేట్ వద్ద వారి సమ్మె శిబిరాన్ని డీఈఓ వెంకటేశ్వరాచారి సోమవారం సందర్శించి కార్మికులతో మాట్లాడారు. సెప్టెంబర్ వరకు పెండింగ్ బిల్లులు, వేతనాలను మూడు రోజుల్లో వంట కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసం పుష్పావతి, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

నేలకొండపల్లి: తెలంగాణ, ఏపీల్లోని వివిధ ప్రాంతాలకు చోరీలకు పాల్పడుతున్న నిందితుడు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఇటీవల మండలంలోని వివిధ గ్రామాల్లో చోరీలు జరిగాయి. దీంతో నిఘా పెంచిన పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సదరు నిందితుడు పట్టుబడ్డాడని సమాచారం. ఈమేరకు విచారణలో రెండు రాష్ట్రాల్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిసింది. అయితే, ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా ధృవీకరించలేదు.

పామాయిల్ గెలలు




టన్ను ధర	రూ.12,231

మానసిక ఆరోగ్యంతోనే మంచి సమాజం

- ఒత్తిడి, వివక్షతోనే మానసిక వ్యాధి తీవ్రత
- శాస్త్రీయ వైద్యమే చక్కని పరిష్కారం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



ఇల్లెందురూరల్: పెరుగుతున్న జనాభాతోపాటు అన్ని రకాల జబ్బులు కూడా పెరుగుతున్నాయి. ఏ వ్యాధైనా తొలిదశలో గుర్తించి, సరైన చికిత్స చేయించుకుంటే తగ్గిపోతాయి. మానసిక వ్యాధులు సైతం ఇలాగే తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. కానీ.. మానసిక వ్యాధిగ్రస్తులు అందరిలో ఒకరిలా ఉండలేకపోతున్నారు. ఏ విషయమైనా ప్రతికూలంగా ఆలోచిస్తుంటారు. చిరునవ్వును ఆస్వాదించలేకపోతున్నారు. మానసిక క్షోభ అనుభవిస్తూ జీవితాన్ని నరకం చేసుకుంటున్నారు. ప్రతి విషయంలోనూ ఒత్తిడికి గురికావడం వల్లే మానసిక ఆరోగ్యం క్షీణిస్తోందని.. దీన్ని అధిగమించడానికి జీవితంలో పాజిటివ్ దృక్పథం పెంచుకుంటూ ఒత్తిడిని జయించాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. అప్పుడే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని చెబుతున్నారు.

మహానుభావుల జీవితమే స్ఫూర్తి..

స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటిష్ వారు మహాత్మా గాంధీని రైలు నుంచి కిందకు నెట్టేశారు. ఆ స్థానంలో సాధారణ వ్యక్తులుంటే అవమానం తట్టుకోలేకపోయేవారు. కానీ.. గాంధీ వారినే భారతదేశం నుంచి నెట్టేసే వరకు విశ్రమించలేదు. అవమానాన్ని పట్టుదలగా మార్చుకుని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చే వరకు వెనుకడుగు వేయలేదు. అలాగే.. మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు 91 ఏళ్ల జీవితంలో 60 ఏళ్లు సినిమానే జీవితంగా గడిపారు. సుమారు 40 ఏళ్ల క్రితమే అనారోగ్యానికి గురయ్యారు. తనకు కేన్సర్ ఉందని తెలిసినా.. దానిని జయిస్తానని ధైర్యంగా గడిపారు. నైతిక విలువలు, క్రమశిక్షణ పాటిస్తూ.. నిత్యం నడక, మితాహారం, సమయానుకూలంగా నిద్ర, అందరితో స్నేహంగా, సంతోషంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోగలిగారు. తాను సంతోషంగా ఉంటూ ఇతరులను ఆనందంగా ఉంచగలిగితే అంతకు మించింది మరేదీ లేదు. ప్రతి మనిషికి జీవితంలో ఏదో ఒక ఘటన జరుగుతుంది. దాని నుంచి పాఠాలు నేర్చుకోవాలి.

మానసిక వ్యాధులు.. లక్షణాలు

మనిషి శరీరంలో జరిగే రసాయనిక మార్పులు, హార్మోన్లకు సంబంధించిన మార్పుల వల్ల మానసిక వ్యాధులు పుట్టుకొస్తాయి. సెరటోనిన్ అనే రసాయన పదార్థం మెదడులోని నాడీ కణాల్లో తగ్గినప్పుడు డిప్రెషన్ వస్తుంది. ఈ వ్యాధితో బాధ పడేవారు ఎప్పుడూ నిషాతో ఉండటం.. ఆత్మహత్య ఆలోచనలు, నిద్ర రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డోపమెన్ అనే రసాయన పదార్థం మెదడులోని కొన్ని భాగాల్లో ఎక్కువగా పెరగడంతో స్కిజోఫ్రీనియా అనే వ్యాధి వస్తుంది. విచిత్రమైన అనుమానాలు, భయభ్రాంతులు, వారిలో వారే మాట్లాడుకోవడం వంటి లక్షణాలు ఉంటాయి. మెదడులో సెరటోనిన్, అడ్రినలిన్ అనే రసాయన పదార్థాల హెచ్చుతగ్గులతో ఆనక్సిటీ వ్యాధి వస్తుంది. ఎసిట్రిల్ కోలిన్ అనే రసాయన పదార్థం తగ్గినప్పుడు మతిమరుపు వస్తుంది. బైపోలార్ డిజార్డర్ అనే వ్యాధికూడా రసాయనాల హెచ్చుతగ్గుల వల్ల వస్తుంటుంది.

మంత్రాలు, తాయత్తులతో తగ్గదు



మానసిక వ్యాధి వస్తే మంత్రాలు, తాయత్తులు కట్టించుకుంటుంటారు. గ్రామీణ ప్రాంతాలలో ఈ విశ్వాసాలు ఎక్కువ. పట్టణాల్లోనూ కొన్నిచోట్ల ఈ సంస్కృతి కనిపిస్తోంది. మానసిక జబ్బులకు శాస్త్రీయ వైద్యం ఒక్కటే పరిష్కార మార్గం. మందులు వాడినా తగ్గట్లేదు అనే ధోరణి ప్రజల్లో ఉంది. ఒక్కోసారి నెల పట్టొచ్చు. ఆరు నెలలైనా పట్టొచ్చు. కానీ మానసిక ఆరోగ్యానికి ఇదే మంచి మార్గం.

– డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

ఒత్తిడిని అధిగమిద్దాం ఇలా..

మనుషులు పలు కారణాలతో అనేక రకాల ఒత్తిడులకు గురవుతుంటారు. అవి శారీరక, మానసిక ఒత్తిడి అని రెండు రకాలుంటాయి. ఆరోగ్యం కాపాడుకుంటే శారీరక ఒత్తిడిని జయించవచ్చు. మిత ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం, నిత్యం యోగా చేయడం, వృత్తిపరమైన శిక్షణతో మానసిక ఒత్తిడిని అధిగమించొచ్చు. వ్యాపారంలో సరైన లాభాలు రాకపోవడం, అధిక పని, పదోన్నతి లేని ఉద్యోగంలో ఒత్తిడి పెరుగుతుంది. చేసే పనిని ప్రేమించాలి. వృత్తిపరంగా గెలుపు, ఓటములు ఉంటాయి. ఓటమిని సవాల్‌గా స్వీకరించి విశ్లేషించుకుని ముందుకెళ్లాలి. స్ఫూర్తిదాయక వ్యక్తుల మధ్య గడపడం, మంచి పుస్తకాలు చదవడం, అనవసర ఆలోచనలు, చికాకులను దూరం పెట్టడం ద్వారా సంతోషమైన జీవితాన్ని గడపాలి.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, భీమ్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి అర్హులకు పథకాలు వర్తింపచేయాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఆదినారాయణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

27 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వండి

మణుగూరు టౌన్: బీటీపీఎస్‌కు బొగ్గు తరలించేందుకు నిర్మిస్తున్న ట్రాక్‌లో భాగంగా మణుగూరు మండలంలోని విప్పలసింగారంలో బాధితులైన 27 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా ఐటీడీలోని గిరిజన దర్బార్‌లో ఏపీఓ డేవిడ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెరువు ముందు సింగారంలో నిర్మిస్తున్న రైల్వే ట్రాక్ వల్ల గ్రామానికి రహదారి సౌకర్యం లేకుండా పోవడమేకాక దుమ్ము, ధూళితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్యతో పాటు పాల్వంచ రాములు, కారం సూరయ్య, పాల్వంచ శ్రీను తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ఝాన్సీలక్ష్మికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు

చుంచుపల్లి/చంద్రుగొండ/కొత్తగూడెం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి సూచించారు. చుంచుపల్లి మండలం 4ఇంక్‌లైన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు చంద్రుగొండలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే, కొత్తగూడెంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత, సీడీపీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే, కూరగాయలు, ఆకుకూరలతో పాటు ఔషధ మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది ఎదురుకాకుండా పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు లెనీనా, నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్లు చంద్రకళ, శకుంతల, రాణి, సిబ్బంది లక్ష్మి, కనకమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం : మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ సోమవారం లభ్యమైంది. విద్యార్థుల అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా, పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థులు మండలంలోని మహాదేవపురం గ్రామంలోని సమీప బంధువు గట్టుపల్లి నాగమ్మ ఇంట్లో ఉండటంతో వారిని చేరదీసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఎస్ఐ గణేష్ కౌన్సిలింగ్ చేసి వారికి అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మోతీర్, ఉపాధ్యాయులు సర్వేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గంటల పాటు హల్‌చల్

- ఇల్లు, భూమి ఆక్రమించారంటూ సెల్ టవరెక్కి నిరసన
- సీఐ జోక్యంతో దిగివచ్చిన యువకుడు



సెల్ టవర్‌పై నిరసన తెలుపుతున్న గౌతమ్

పాల్వంచరూరల్ : తన తాతల నుంచి వచ్చిన రెండున్నర ఎకరాల భూమి, ఇంటిని ఉపసర్పంచ్ అక్రమంగా ఆక్రమించుకున్నారంటూ మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన సురుగు గౌతమ్ అనే యువకుడు సోమవారం సెల్ టవరెక్కి నిరసన తెలిపాడు. కొత్తగూడెం విద్యానగర్‌లో ఉంటున్న గౌతమ్.. కిన్నెరసానిలో తన తల్లిదండ్రులకు చెందిన ఇల్లు, రెండున్నర ఎకరాల భూమిని ఉపసర్పంచ్ కొంగర అప్పారావు ఆక్రమించాడని, ఇల్లు, భూమి ఇప్పించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. తనకు న్యాయం చేసేంతవరకు కిందకు దిగేది లేదని భీష్మించాడు. ఇదే సమస్యపై గతంలో కొత్తగూడెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేసినాఅధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉదయం 7 గంటల నుంచి సెల్ టవర్‌పై నిరసన వ్యక్తం చేస్తుండగా సమాచారం అందుకున్న రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ భీక్షం, డీటీ వినయ్ శీలాశ్రీరాం, ఆర్ఐ హచ్యా ఘటనా స్థలానికి వెళ్లి కిందకు దిగి వస్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా గౌతమ్ దిగి రాకపోవడంతో మధ్యాహ్నం 1.30 గంటలకు సీఐ వినయ్‌కుమార్ సెల్‌టవర్ వద్దకు చేరుకుని ఫోన్ ద్వారా నచ్చజెప్పారు. భూమి, ఇంటికి సంబంధించిన కాగితాలు సక్రమంగా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగివచ్చాడు. అనంతరం కిన్నెరసానిలో ఆక్రమణకు గురైన ఇల్లు, భూమిని గౌతమ్ అధికారులకు చూపించగా పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూ రికార్డులను తీసుకుని కలెక్టరేట్‌కు వెళ్లారు. సమస్యను డీఆర్‌ఓ రవీంద్రనాథ్‌కు వివరించగా అక్రమించిన వ్యక్తికి నోటీసులు ఇవ్వాలని డీటీని ఆదేశించారు.

విద్యుత్ షాక్‌తో వాచ్‌మెన్ మృతి..?



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు సబ్‌స్టేషన్ వాచ్‌మెన్ తాటి కోటేశ్వరావు(37) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు సోమవారం చర్ల – భద్రాచలం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. కాగా, కోటేశ్వర్‌రావు సోమవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గంగోలు గ్రామంలో స్పెషర్ (పోల్, పోల్‌కు మధ్యలో వైర్లు తగలకుండా చేయడం) పని చేస్తుండగా ఫిట్స్ వచ్చి నిచ్చెన పైనుంచి కింద పడ్డాడని, దీంతోనే మృతి చెందాడని అంటున్నారు. అయితే విద్యుత్ షాక్‌తోనే మరణించాడంటూ కుటుంబసభ్యులు మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేశారు. విద్యుత్ అధికారులు వచ్చి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ధర్నాతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ఎస్ఐ కేశవరావు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరడంతో మృతదేహాన్ని సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆందోళన చేపట్టారు. విద్యుత్ శాఖ ఏడీఈ వేణు ఘటనా స్థలానికి చేరుకుని ఏఈ మోహన్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబసభ్యులతో చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు.

ఎస్సై కొట్టారంటూ ఆత్మహత్యాయత్నం



పురుగుమందు డబ్బాతో జనార్దన్

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గజ్జి జనార్దన్ ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన వద్ద ఆదివారం రాత్రి కొందరు యువకులు మద్యం సేవిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన ఎస్సై తిరుపతిరావు వారిని మందలించారు. దీంతో యువకులు పోలీసులపై రాళ్లు విసిరి పరారయ్యారని, ఆ తర్వాత ఎస్సై సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి విచారించగా మద్యం తాగే వ్యక్తి జనార్దన్ అని తెలిసిందని, దీంతో అతడిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకుండా దుర్భాషలాడినట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా, తమకు ఏ సంబంధం లేదని చెప్పినా వినకుండా ఎస్సై జనార్దన్‌పై చేయి చేసుకున్నాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. తాను ఏ తప్పు చేయకున్నా గ్రామస్తుల ముందు ఎస్సై కొట్టడం అవమానంగా భావించి మనస్తాపంతో పురుగు మందు తాగుతున్నానని జనార్దన్ సెల్ఫీ వీడియాలో మాట్లాడుతూనే పురుగుమందు తాగాడు. ఇది సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. జనార్దన్‌ను కుటుంబసభ్యులు మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సీఐ రవీందర్‌ను వివరణ కోరగా రహదారి వెంట మద్యం సేవిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన ఎస్సై మందలించారని, జనార్దన్‌ను ఎస్సై కొట్టలేదని, సరైన సమాధానం చెప్పకుండా అతడే ఎస్సైపై దుర్భాషలాడాడని తెలిపారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై మూడురోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ అంశంపై ఆసక్తి ఉన్న వారు వాతావరణ పర్యవేక్షకులు సుమన్(99668 14470), ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ (99896 33364)ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కేవీకే అధికారులు సూచించారు.

కాలం చెల్లిన శీతలపానీయాల విక్రయం

అశ్వారావుపేటరూరల్: దాదాపు ఏడాది క్రితం కాలం చెల్లిన ఓ కంపెనీకి చెందిన శీతల పానీయాలను డీలర్ విక్రయిస్తున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటలోని ఓ ప్రముఖ కంపెనీకి చెందిన డీలర్ కొద్ది రోజులుగా స్థానిక కూల్ డ్రింక్స్, పాన్, కిరాణా దుకాణాలకు ఎక్స్‌పైరీ అయిన కూల్ డ్రింక్ బాటిళ్లను ఒక్కో కేసులో (కేసుకు 24 బాటిళ్లు) నాలుగు చొప్పున పెట్టి దుకాణాలకు సరఫరా చేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, సంత మార్కెట్ వద్ద గల షాపులో ఓ వినియోగదారుడు కూల్‌డ్రింక్ కొనుగోలు చేయగా, గతేడాది నవంబర్ 14 వరకే దాని గడువు ఉండటాన్ని గుర్తించాడు. ఈ విషయాన్ని షాపు నిర్వాహకురాలి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె సదరు డీలర్ సరఫరా చేసిన శీతలపానీయాలను పరిశీలిస్తే ఒక్కో కేసుకు నాలుగు బాటిళ్ల చొప్పున కాలం చెల్లినవే ఉన్నట్లు బయటపడింది. ఈ విషయాన్ని కంపెనీ డీలర్ దృష్టికి తీసుకెళ్లగా, తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు తెలిసింది. దాంతో డీలర్‌పై ఆమె ఫిర్యాదు చేస్తానని చెబుతోంది. కాగా గడువు తీరిన శీతల పానీయాలను సరఫరా చేయడం ఆ డీలర్‌కు ఇది కొత్తేమీ కాదనే ప్రచారం జరుగుతోంది. దీనిపై కంపెనీ డీలర్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, గడువు తీరిన బాటిళ్లను సరఫరా చేయలేదని చెప్పడం గమనార్హం. మరి కాలం తీరిన బాటిళ్లు షాపులోకి ఎలా వచ్చాయని ప్రశ్నిస్తే సమాధానం దాటవేశాడు.

వృద్ధురాలి అదృశ్యం



అదృశ్యమైన సత్యవతి

టేకులపల్లి: మండలంలోని ప్రెగళ్లపాడుకు చెందిన వృద్ధురాలు జంజం సత్యవతి (75) అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. సత్యవతి ఈనెల 6న భద్రాచలం వెళ్లివస్తానని ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మనువడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన మాచర్ల బాబూరావు సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. రిటైర్డ్ ఉద్యోగి అయిన బాబూరావు కొంతకాలంగా అధికంగా మద్యం సేవిస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సువార్త ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థులు..

వేర్వేరు గ్రామాల్లో ఘటనలు



నాగేశ్వరి (ఫైల్)



విజయ్ (ఫైల్)

తల్లాడ: వేర్వేరు గ్రామాలకు డిగ్రీ విద్యార్థులు ఇద్దరు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తల్లాడ మండలం మంగాపురానికి చెందిన కుంచం నాగేశ్వరి(18) ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అలాగే, నారాయణపురం గ్రామానికి చెందిన సంగసాని విజయ్(18) సైతం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వీరిలో నాగేశ్వరి రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరంలో చేరి అక్కడి నుంచి వైరాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు మారింది. ఇక విజయ్ క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సమీప గ్రామాలకు చెందిన వీరిద్దరు తొలుత ఒకే కళాశాలలో చేరగా... ఒకేరోజు ఆత్మహత్యకు పాల్పడడం అనుమానాలకు తావిస్తుండగా, రెండు గ్రామాల్లో విషాదాన్ని నింపింది. కాగా, ఘటనలపై తమకు ఫిర్యాదు అందలేదని తల్లాడ ఎస్ఐ సురేష్ తెలిపారు.

మార్పులు, చేర్పులు షురూ !

- బీఆర్ఎస్‌లో చేరిన మడత వెంకట్‌గౌడ్
- కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి లక్కినేని



వెంకట్‌కు గులాబీ కండువా కప్పిన మంత్రి కేటీఆర్

ఇల్లెందు: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ గులాబీ కండువా కప్పుకున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సోమవారం బహిరంగ సభకు హాజరైన రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఆయన కలవగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి పనిచేస్తానని చెప్పారు. ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ అంగోత్ బిందు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సురేందర్‌రావు..

టేకులపల్లి: టేకులపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోగా, కొత్తగూడెం అసెంబ్లీ సీటు కోసం దరఖాస్తు చేసుకుంటే పట్టించుకోలేదనే మనస్తాపంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన టేకులపల్లిలోని రామాలయం, సేవాలాల్ ఆలయాల్లో పూజలు చేశాక హైదరాబాద్ వెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షాన బీజేపీలో చేరారు. లక్కినేని వెంట ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, లక్కినేని సాయి, బీజేపీ మండల అధ్యక్షుడు దారా వత్ బాలాజీతోపాటు బోడ పూన్యా నాయక్, వాంకుడోత్ హత్తీరాంనాయక్, చిక్కా వెంకటేశ్వర్లు, దేవ్‌సింగ్, నరేష్, స్వాతి, రాంజీ తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ అధికారులు సోమవారం అరెస్టు చేసి, వారి బైక్‌లను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలిలా.. ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఒక వ్యక్తి బ్యాగ్‌తో రావడాన్ని గమనించి ఆపే ప్రయత్నం చేశారు. అతను ఆపకుండా వేగంగా వెళ్తుండడంతో సిబ్బంది వెంబడించగా బైక్ వదిలి పరారయ్యాడు. ఆ బైక్‌ను పరిశీలించగా ఒక బ్యాగ్‌లో ఉన్న మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం పాల్వంచ నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద రెండు కేజీల గంజాయి ప్యాకెట్లు దొరకగా వారిని అరెస్టు చేసి గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో వరంగల్‌కు చెందిన కౌశిక్, అదే ప్రాంతానికి చెందిన రాహుల్‌ను రిమాండ్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు తులాల బంగారం చోరీ

ఇల్లెందు: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వెనుక ఉన్న సింగరేణి క్వార్టర్‌లో సోమవారం ఆరు తులాల బంగారం చోరీ అయింది. రైల్వే ఉద్యోగి అయిన అశ్విని విధులకు హాజరై ఇంటికి చేరుకునేసరికి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఆరు తులాల బంగారం చోరీ జరిగినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

మహిళపై అసభ్య ప్రవర్తన..

పాల్వంచరూరల్ : కిరాణం దుకాణం నడుపుతున్న మహిళ వద్దకు సబ్బు కావాలని వచ్చి చెయ్యిపట్టి లాగిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని సంగం గ్రామానికి చెందిన ఓ మహిళ కిరాణ దుకాణం నడుపుతోంది. సోమవారం అదే గ్రామానికి చెందిన అప్పుల సురేష్ వచ్చి సబ్బు ఇవ్వమని అడిగాడు. సబ్బు తెచ్చి ఇస్తుండగా చెయ్యిపట్టి లాగడంతో కేకలు వేసింది. ఇంట్లో ఉన్న తన తండ్రి అడ్డుకోవడంతో కొట్టి పారిపోయాడని బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.